# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం,29 జూన్ 2024




## డయేరియా రోగులను సందర్శించిన వైస్ చైర్మన్, కౌన్సిలర్‌లు



**సామర్లకోట,మేజర్‌న్యూస్ :** సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతిసార (డయేరియా) రోగులని మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్‌తో పాటు అందరు వైసీపీ కౌన్సిలర్‌లు, వైసీపీ నాయకులు, మున్సిపల్ కమిషనర్‌తో కలసి శుక్రవారం సందర్శించారు. అతిసార వ్యాధితో చికిత్స పందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిపై స్థానిక వైద్యాధికారి డా. పి అమలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈసందర్భంగా వైస్ చైర్మన్ జాన్ మోసెస్, ఛైర్పర్శన్ ప్రతినిధి గంగిరెడ్డి కృష్ణమూర్తి, కౌన్సిలర్ పాగాసురేష్ తదితరులు మాట్లాడుతూ అతిసార భారిన పడిన వారు ఆరోగ్యంగానే ఉన్నట్టు చెప్పారు. అయితే వర్షాకాలం కాలుష్య జలాల కారణంగా ఈ పరిస్థితి కలగడం సాధారణం అయినందున కాచి చల్లార్చిన నీటిని త్రాగాలని సూచించారు. కాగా కమిషనర్ రామారావు మాట్లాడుతూ కొళాయిల ద్వారా ఫిల్టర్ బెడ్ చెరువులో జలాలను వాడకుండా నేరుగా గోదావరి జాలాలను సేకరించి శుద్ధిచేసి త్రాగునీరు అందిస్తున్నట్టు చెప్పారు. ప్రతీరోజు వార్డుకు రెండు చొప్పున త్రాగునీటి సాంపిళ్లను సచివాలయాల సిబ్బందితో సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అయితే రిపోర్టులు మంచిగానే వస్తున్నట్టు ఆయన చెబుతూ కొద్ది రోజులు పాటు ప్రజలు మాంసాహారాన్ని మానుకుని, నిల్వ ఉంచిన పదార్ధాలు తినకుండా ఉండాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో అందరు వైసీపీ కౌన్సిలర్ లు, నాయకులు పాల్గొన్నారు.

# కాకినాడ పోర్ట్‌లో కలకలం









## బియ్యం గోదాముల్లో మంత్రి నాదెండ్ల విస్తృత తనిఖీలు

### - రా రైస్‌ను నూకలుగా మార్చి విదేశాలకు ఎగుమతి

### - రేషన్ బియ్యంతో అక్రమాలు బట్టబయలు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని క్షేత్రస్థాయిలో రీసైకిలింగ్ చేసి విదేశాలకు తరలించేవారిపై సమగ్ర విచారణ చేపట్టి, తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.కాకినాడ జిల్లాలో పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన..రాష్ట్ర పౌరసరఫరాల విసి, ఎండీ వీరపాండ్యన్, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాలు, రెవిన్యూ, లీగల్ మెట్రాలజీ తదితర శాఖల అధికారులతో కలిసి కాకినాడ పట్టణం పరిధిలోని పోర్ట్ ఏరియా, కాకినాడ రూరల్, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని బియ్యం గోదాములు, ఆగ్రో ఇండస్ట్రీ లను తనిఖీ చేసి, నమూనాలను సేకరించారు. తొలుత పోర్ట్ ఏరియాలో ఉన్న విశ్వప్రియ బియ్యం గోదాము, బీచ్ రోడ్డులోని సాటక్స్ ఇండియా రవీంద్ర బియ్యం గోదాము, మానస ఎక్స్‌పోర్ట్, డీఎస్ఎన్ బియ్యం గోదాము, కరప మండలం నడకుదురులోని లావన్ ఇంటర్నేషనల్ బియ్యం గోదాము, చల్లంగిలోని సరళ ఫుడ్స్, తాళ్ళరేవు మండలం యానం రోడ్డు చల్లంగిలోని విష్ణు పట్టాభిరామ ఫుడ్స్, ఆగ్రో ఇండస్ట్రీ, చోల్లంగి విశ్వగోదాము, తురంగిలోని విఎస్.రాజు సన్స్ తదితర బియ్యం గోదాములను అధికారులతో కలిసి బియ్యం నిల్వలను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రెండు రోజుల కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా ఉదయం నుంచి 10 బృందాలు కాకినాడ పట్టణం, కాకినాడ గ్రామీణం, ముమ్మిడివరం నియోజకవర్గాల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో బియ్యం నిల్వల కేంద్రాలను తనిఖీలు చేయడం జరిగిందన్నారు. పేద ప్రజలకు రేషన్ షాపుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని క్షేత్రస్థాయిలో రీసైకిలింగ్ చేసి అక్రమంగా విదేశాలకు తరలించే వారిపై సమగ్ర విచారణ చేపట్టి, తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో వినియోగదారులకు ప్రభుత్వం ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని నూటికి నూరు శాతం నిజాయితీగా చేరేలా కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి నష్టం కలిగించేలా పనిచేస్తున్నవారిపై చట్టపరకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీలు నిర్వహించిన పది ప్రాంతాల్లో ఏడు చోట్ల పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేస్తున్నట్లు స్పష్టమైన ఆధారాలు దొరికాయన్నారు. వీరందరి మీద సెక్షన్ 6ఎ, లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా కేసులు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకకుంటామన్నారు. కాకినాడ ప్రాంతాన్ని మాఫియాకు అడ్డాగా తయారు చేశారని, 2019- 24 మధ్య చాలా మార్పు చోటు చేసుకున్నాదన్నారు. పీడిఎస్ బియ్యానికి సంబంధించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేయడం ప్రారంభించామని మంత్రి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు నిజాయితీగా పని చేసి, ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు. నమోనాలు సేకరించి, ఆధారాలు దొరికిన చోట స్టాక్ సీజ్ చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రెవిన్యూ, పౌరసరఫరాలు, లీగల్ మెట్రాలజీ శాఖలు సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ తనిఖీలు భవిష్యత్తులో ఇంకా కొనసాగుతయాని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.పర్యటనలో మంత్రి వెంట లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ డి.రామ్ కుమార్, పి.సుధాకర్, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ ఎన్.జనార్ధన్ రావు, పౌరసరఫరాల సంస్థ డీఎం బి. బాల సరస్వతి, డీఎస్‌వో ఎంవి.ప్రసాద్, డీ.ఎస్.డీ.టీ.వో లు, ఇతర పౌరసరఫరాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# సమన్వయం, అంకితభావంతో పనిచేయాలి

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ధాన్యం కొనుగోలు వ్యవస్థపై రైతుల్లోను, పౌర సరఫరాల వ్యవస్థపై పేదల్లోనుమరలభరోసా, నమ్మకాలను నింపేందుకు సమన్వయం, అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం,పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను కోరారు.శుక్రవారం కాకినాడ జిల్లాలో జరిపిన తమ పర్యటనలో భాగంగా రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఉదయం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో పౌర సరఫరాలు, అనుబంధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆయా శాఖల ద్వారా అమలౌతున్న కార్యక్రమాలను సమీక్షించి, ఆదేశాలు జారీ చేశారు. మంత్రితో పాటు రాష్ట్ర పౌరసరఫరాల కార్పోరేషన్ వైస్ చైర్మన్ జి.వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్,కాకినాడసిటీఎమ్మెల్యేవనమాడి వెంకటేశ్వర రావు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

తొలుత చేపట్టిన పౌర సరఫరాల శాఖ సమీక్షలో గత ఖరీఫ్ సీజన్‌లో నిర్వహించిన ధాన్యం సేకరణ, రబీలో సేకరణ ప్రగతిని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా జిల్లాలో గత సీజనులో నమోదైన ఈ క్రాప్ బుకింగ్ శాతం, ధాన్యం సేకరణలో ఆర్బికేల వద్ద, మిల్లుల వద్ద రైతులు ఎదుర్కొన్న సమస్యల వివరాలను మంత్రి అధికారులను అడిగారు. ఆర్బికేల వద్ద గుర్తించిన తేమ శాతం కంటే మిల్లర్ల వద్ద తేమ శాతం ఎక్కువ రీడింగ్ రావడం వల్ల అదనంగా ధాన్యం ఇవ్వవలసి వచ్చి నష్టపోయామని, నాణ్యత లేని, కన్నాలు పడిన గోనె సంచులు సరఫరా చేసారని పలు చోట్ల రైతులు తెలిపినట్లు అధికారులు ఆయనకు తెలిపారు.తేమనిర్ధారణలో మోసపోయిన రైతుల నుండి ఫిర్యాదులు సేకరించాలని మంత్రి అధికారులను ఆదేశించి, రైతులను మోసగించినమిల్లర్లపైచర్యగొంటామని తెలియజేశారు. రైతులకు నాణ్యమైన గోనెసంచులతోపాటుధాన్యాన్ని తడవకుండా కాపాడుకునేందుకు టార్పాలిన్‌లు సరఫరా చేస్తామని, రైతుల అవసరాలపై నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఉపయోగించుకునేందుకు ధాన్యంకళ్లాలనుఏర్పాటు చేయాలన్నారు.జిల్లాలోని మెట్టప్రాంతరైతులువరికి బదులు లాభదాయకమైన వాణిజ్య పంటలు చేపట్టేలా ప్రోత్సహించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. అలాగే పౌర సరఫరా వ్యవస్థ ద్వారా ఆరోగ్యదాయకమైన మిల్లెట్ ధాన్యాలను పంపిణీ చేసేందుకు యోచిస్తున్నామని, ఈ అవసరాల కనుగుణంగా రైతులలో అధిక ఆదాయాన్నిచ్చే చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని కోరారు. సిసిఆర్సి కార్డుల జారీ అంశంపై సమీక్షిస్తూ 2019 నాటికి జిల్లాలో కౌలు రైతుల శాతం 79 శాతంగా ఉండగా, ప్రస్తుతం ఇది గణనీయంగా తగ్గిపోవడం పడిపోవడం పట్ల మంత్రి విస్మయాన్ని, అనుమానాలనూ వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో ప్రధాన పాత్ర వహిస్తున్నది కౌలు రైతులేనని, వారి సంక్షేమం కోసం చట్టాల్లో అవసరమైన మార్పులను ప్రభుత్వం చేపడుతుందని మంత్రి తెలిపారు. సమీక్షలో ప్రజాపంపిణీ, మద్యాహ్న భోజన పథకం అమలు అంశాల్లో వివిధ శాఖల అధికారుల మద్య సమన్వలోపం పట్ల మంత్రి అసంతృప్తి వ్యక్తం చేసారు. పిడిఎస్ ద్వారా గోధమ పిండి కొరకు కార్డుదారుల నుండి డిమాండు ఉన్నప్పటికీ, ఏప్రియల్ నెల నుండి అవసరమైన సరఫరాకోసం పౌర సరఫరా అధికారులు ఇండెంట్ చేయకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వెలిబుచ్చారు. సివిఎస్‌డిటిలు పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన నాణ్యమైన బియ్యా సక్రమంగా వినియోగిస్తున్నదీ లేనిదీ తప్పని సరిగా తనిఖీ చేయాలని ఆదేశించారు.పిడిఎస్ సరుకులను రవాణా చేసే వాహనాలపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి అక్రమ తరలింపులను అరికట్టాలని ఆదేశించారు.జిల్లాలో కొత్త రేషన్ కార్డులు, కార్డుల విభజన కోసం ప్రజల నుండి అందిన ధరఖాస్తుల వివరాలను సమర్పించాలని, తీర ప్రాంతాలల్లోని మత్స్యకార కాలనీలలో నివసిస్తున్న కుటుంబాలకు అదనపు సరఫరాలు అందించేందుకు వీలుగా వినూత్న విధానాన్ని ప్రతిపాదించాలని కోరారు.పంపిణీప్రక్రియ నుండి వైదొలగిన యండియు ఆపరేటర్ల నుండి వాహనాలను స్వాధీనం చేసుకోవాలని ఆర్డిఓలను ఆదేశించారు.ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా రాష్ట్రంలోని 251 ఎంఎల్ఎస్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించగా, 189 పాయింట్లలో నిల్వల వ్యత్యాసాలు కనుగొనడం జరిగిందని, అక్రమాలకు పాల్పడిన సప్లయిర్స్ పై కేసులు పెట్టి బ్లాక్ లిస్ట్ చేసామని మంత్రి తెలిపారు. కాకినాడ పోర్టు కేంద్రంగా బియ్యం మాఫియా వ్యవస్థీకృతమైందని, చిత్తూరు నుండి కాకినాడ వరకూ పేదల పొట్టగొట్టి దోచిన బియ్యాని పోర్టు ద్వారా ఎగుమతి చేసి కోట్లాది రూపాయాలు ఆర్జించారని, అక్రమార్కులను విడిచిపెట్టేది లేదన్నారు. అధికారులు పారదర్శకంగా, నిజాయితీగా పనిచేయాలని, దోపిడీదారులకు సహకరించే వారిని ఉపేక్షించమన్నారు.

గత ప్రభుత్వం పౌర సరఫరాలశాఖ పేర 36,300 కోట్ల రూపాయల భారీ అప్పులు చేసిందని, రైతులకు మాత్రం 1600 కోట్ల బకాయిపెట్టి వెళ్లిందన్నారు. దేశానికి అన్నం పెడుతున్న రైతన్నలను తమ ప్రభుత్వం ఈ దోపిడీ వ్యవస్థల నుండి రక్షించి అన్ని విధాల ఆదుకుంటుందని, ప్రభుత్వం పట్ల ప్రజల ఆకాంక్షలను వమ్మకానీయమని మంత్రి మనోహర్ తెలియజేసారు.

సమావేశంలో కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్‌బికేలలో చేరి అక్రమ ధాన్యం కొనుగోళ్లతో రైతులను మోసం చేసి దోచుకున్న ప్రయివేట్ వ్యక్తులపై చర్యలు చేపట్టాలని కోరారు. కాలువల ద్వారా పొలాలకు సక్రమంగా నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారని, కాల్వ పూడికలను చేపట్టాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరపుల సత్యప్రభ విజ్ఞప్తి చేసారు. గత 5 సంవత్సరాలుగా పౌరసరఫరా వ్యవస్థపై ఎటువంటి సమీక్ష లేక అక్రమాల పుట్టగా మారిందని, కష్టాలతో కునారిల్లిన రైతుల గోడు వినే నాథుడే కరువైయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి మాట్లాడుతూ సమీక్షలో మంత్రి సూచించిన అంశాలను ఆయా శాఖల సమన్వయంతో అమలు చేస్తామని తెలియజేశారు.ఈ సమావేశంలో డిఆర్ఓ డా. కె.తిప్పేనాయక్, ఆర్డిఓలు ఇ.కిషోర్, జె.సీతారామరావు, వ్యవసాయ శాఖ జెడి విజయ్ కుమార్, పౌర సరఫరాల అధికారి ఎం.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# ఇంటి వద్దకే ఫింఛన్ల పంపిణి

**– కమీషనర్ పద్మావతి**



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘంలో 14 సచివాలయాల పరిధిలో గల 29 వార్డులలో జూలై 1వ తేదిన ఫించను లబ్దిదారులకు ఇంటి వద్దకే సచివాలయ సిబ్బంది ద్వారా అందజేయడం జరుగుతుందని, మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ పెద్దాపురం పురపాలక సంఘంలో 6,187 ఫించనుదారులకు రూ.4కోట్ల 24 లక్షల రూపాయలు నిధులు జమ అయ్యాయని, వీటిని 1వ తేదిన ఫించను లబ్దిదారులకు ఇంటి వద్దకు అందజేయడం జరుగుతుందని, కావున ఫించను లబ్దిదారులకు గమనించాలని ఆయన తెలిపారు.

# అన్నవరప్పాడు వెంకన్న ఆలయ కవులు భూములు వేలం

**పెరవలి, మేజర్ న్యూస్ :** అన్నవరప్పాడు గ్రామంలో 16వ నెంబర్ జాతీయ రహదారి ప్రక్కన ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానమునకు చెందిన 2. 53 సెంట్లు భూమిని కౌలు నిమిత్తం ఒక సంవత్సర కాలానికి దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశముల మేరకు జూన్ 28వ తేదీ శుక్రవారం ఆలయ ఆవరణంలో బహిరంగ వేలం నిర్వహించగా రూ 1,01,300 లు ఆదాయం సమకూరునది అని ఆలయ ఈవో మీసాల రాధాకృష్ణ తెలియజేశారు. ఇది గత సంవత్సరం మగతా కంటే రూ 18,300 లు అధిక ఆదాయం సమకూరినది అన్నారు. ఈ కార్యక్రమంలో తీపర్రు గ్రూపు దేవాలయంల కార్యనిర్వహణాధికారి ఎంవీ రామయ్య పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించారు అన్నారు. ఈ కార్యక్రమంలో అన్నవరప్పాడు గ్రామస్తులు, పాట దారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వం ప్రాధాన్యత పథకాల ప్రయోజనాన్ని అందరికీ చేర్చే భాద్యత అధికారులపై ఉంది

- ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్,మే,జూన్ మాసాలకు రూ.3 వేలు కలుపుకొని..
- జూలై 1 తేదీన రు.7 వేల రూపాయలు లబ్ధిదారులు పెన్షన్ అందజేయనున్నాం
- ఉండ్రాజవరం మండల స్థాయి సమీక్షలో పాల్గొన్న రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్



**ఉండ్రాజవరం,మేజర్‌న్యూస్ :** రాష్ట్రప్రభుత్వం ప్రాధాన్యత కార్యక్రమాలను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో క్షేత్రస్థాయిలో అర్హులైన అందరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమా ఆటోగ్రాఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీ సుధీంద్ర బాబు ధార్మిక ట్రస్ట్ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటుచేసిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమల తీరుపై మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో అందిస్తూ పరిపాలన కొనసాగించేలా అధికారులు దృష్టి సారించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వ విధానాల మవే మేరకు క్షేత్రస్థాయిలో చేపట్టవలసిన పనులను నెల రోజులు ముందు గానే కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని పనులు చేసేందుకు అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. ప్రతినెల నిర్వహించే సమీక్ష సమావేశంలో గత మాసంలో చేసిన పనులు ఏ మేరకు అయినవి రాబోయే మాసంలో ఏయే పనులను చేపట్టాలనే లక్ష్యంతో అధికారులు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకొనిఆదిశగా లక్ష్యసాధన చేయాలన్నారు.ప్రభుత్వ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులకు అందించవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పని చేస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వానికి మంచి పేరును తెచ్చే బాధ్యత మనపై ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు విద్యా కిట్స్ ను మంత్రి అందజేశారు ఒక భావజాలానికి అలవాటు పడిన అధికారులు, ఉద్యోగులు అది విడనాడి ప్రస్తుత ప్రభుత్వం అందించే విధి విధానాలు ద్వారా క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలను అమలు అందించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టి లో పెట్టుకొని, సీజనల్ వ్యాధు లు ప్రబలకుండా, ముందస్తు ఏర్పాటు చర్యలుచేసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు. అధికారులు పాత విధానా లకు స్వస్తి చెప్పి, ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా ప్రజా స్వామ్య యుతంగా సేవలందించాలన్నారు. డిజాస్టర్ ప్రిపేర్ మెంట్ కోసం సంబంధిత అధికారులు సమావేశం నిర్వహించుకోవాలని, అటువంటి సమయా ల్లో పశుసంపదను కోల్పోకుండా చూసుకోవాలన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల ప్రకారం, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా గత ప్రభుత్వ విద్యార్థులకు పంపిణీ చేసే విద్యా కిట్ల గత ప్రభుత్వ రంగులు మార్చకుండా పంపిణీ చేశామ న్నారు. డ్రాప్ అవుట్స్ లేకుండా, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యాశాఖ పనిచేయాలన్నారు. బాలికా విద్యపై ఎక్కువ దృష్టి పెట్టాలన్నారు. అవసరమైతే మరో రెండు నెల ల్లో మరల సమీక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉందన్నారు. ధాన్యం బకాయిలను త్వరలో రైతులకు చెల్లించేలా ప్రభు త్వం చర్యలు తీసుకుంటుంద న్నారు. జూలై మాసం నుండి అర్హులైన వృద్ధాప్య వితంతు వికలాంగు పెన్షనర్లు అందరికీ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు జులై మాసం నుంచి రు. 4 వేల రూపాయలు, గత ఏప్రిల్ నుండి మూడు మాసములకు ఒక్కొక్క వెయ్యి చొప్పున మొత్తం రు. 7 వేల రూపాయలు లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వపై ఆర్థిక భారం పెద్ద మొత్తంలో పడినప్పటికీ లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్స్ అందించడం మంచి నిర్ణయం అన్నారు. క్షేత్రస్థాయిలో సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులు ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేసే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మండలంలో అమలు వ్యవసాయం, ఇరిగేషన్, రోడ్లు భవనాలు, పంచాయతీ రాజ్, సంక్షేమ పథకాలు, వివిధ రకాల. పింఛన్లు అమలు పై సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో మాజీ శాసన సభ్యులు బూరుగుపల్లి శేషారావు, తహసిల్దార్, కె.నవీన్ కుమార్ ,ఎండిఓ కే.నరేంద్రరెడ్డి,ఈఓఆర్డి జెడివి ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కే శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విధుల్లోకి తీసుకోవాలంటూ ఎమ్మెల్యే, కలెక్టర్‌లకు వినతి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రాక్ సిరమిక్స్‌లో తొలగించిన కార్మికులను వెంటనే విధులకు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రాక్ సిరామిక్స్ కార్మికులు పరిశ్రమ వద్దనుండి సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలోని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఇంటి వద్దకు బైక్ ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే రాజప్పకు వినతిపత్రం అందజేశారు. సిఐటియు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం లో భాగంగా అనంతరం ఎమ్మెల్యే రాజప్పకు వినతిని అందించిన తదుపరి వారు అక్కడనుండి బైక్ ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాధిత కార్మికులు మాట్లాడుతూ ఎలాంటి ముందస్తు సమాచారం అందించకుండా అన్యాయంగా విధుల నుంచి తొలగించారన్నారు. నెలల తరబడి పరిశ్రమ ఎదుట ఆందోళన చేపడుతున్నా యాజమాన్యం తమగోడు వినిపించు కోవడం లేదన్నారు. తమ ఆందోళన ఉద్ధృతం చేస్తూ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ లకు వినతి పత్రాలు అందించామని రానున్న రోజుల్లో తమ నిరసనలు ఉద్ధృతం చెయ్యనున్నట్టు వారు తెలిపారు.

# డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ ద్వారానే డ్వాక్రా సంఘాలు బలోపేతం అయ్యాయని హుస్సేన్ పురం గ్రామ టిడిపి అధ్యక్షులు చల్లా బుజ్జి అన్నారు. శుక్రవారం సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామంలోని డ్వాక్రా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ టిడిపి అధ్యక్షులు చల్లా బుజ్జి మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం తిరిగి ఏర్పడిందని డ్వాక్రా సంఘాలు బలోపేతానికి గతంలో టిడిపి ప్రభుత్వం చేసిన కృషి మాత్రమే అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో స్వయం సహాయ సంఘాలు డ్వాక్రా సంఘాలు బలోపేతానికి కృషి చేశారని ప్రతి డ్వాక్రా మహిళలకు 10000 చొప్పున ఆర్థిక సాయం చేశారని చల్లా బుజ్జి గుర్తు చేశారు రానున్న రోజుల్లో అన్ని డ్వాక్రా సంఘాలకు రుణాల అందించేందుకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప గారు చిత్తశుద్ధితో ఉన్నారని అన్నారు వారి ఆదేశాల మేరకు స్వయం సహాయక సంఘాల బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందించడానికి డ్వాక్రా సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు ప్రతినెల నాలుగో వారంలో ఈ సమావేశాలు జరుగుతాయని ఈ సందర్భంగా తెలిపారు ఈ సమావేశంలో పలు అంశాలు రాజప్ప గారి దృష్టికి తీసుకెళ్లి డ్వాక్రా సంఘాల సమస్యలు పరిష్కారం చేస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో మహిళలు గ్రామ పెద్దలు గ్రామ పంచాయతీ సెక్రెటరీ మరియు యానిమేటర్లు పాల్గొన్నారు.

# పిఠాపురంలో జిల్లా కలెక్టర్ పర్యటన

**– పవన్ వారాహి సభ ప్రాంతాన్ని పరిశీలించిన కలెక్టర్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం పట్టణంలో... కాకినాడ జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి పర్యటించారు. జూలై 1వ తేదీన జనసేన అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే మరియు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారాహి సభ జరునున్న నేపథ్యంలో... పిఠాపురం పట్టణంలో గల ఉప్పాడ బస్టాండ్ ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. సభ నిర్వహణపై అధికారులు నుండి వివరాలు తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. జనసేన అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో భారీ విజయం తర్వాత మొట్టమొదటిసారిగా పిఠాపురం నియోజకవర్గానికి విచ్చేసి మొదటి సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో... సభకు భారీగా ప్రజలు తరలివచ్చే అవకాశం ఉందని, దానికి అనుగుణంగానే ఏర్పాట్లు చేయాలంటూ కలెక్టర్ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం తహసిల్దార్ లక్ష్మి, జడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి, పిఠాపురం సిఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నామ కనకారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పెద్దాపురం మండలంలో 11,862 ఫింఛన్లు పంపిణీకి సన్నాహాలు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలంలో 23 గ్రామాల పంచాయతీల పరిధిలో గల 11,862 ఫించనుదారులకు రూ. 7కోట్ల 85 లక్షల 28వేల రూపాయలు ఇళ్ళ వద్దకే సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపిడిఓ ఎం.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఫించను లబ్దిదారులు గమనించాలని ఆమె తెలిపారు.

# అక్కడే భోజనం.. అక్కడే వైద్యం.. అన్నీ ఉచితం








**కాకినాడ, మేజర్ న్యూస్ ప్రతినిధి :** కాకినాడ జిల్లా పెద్దాపురంలో శ్రీ వత్సవాయి రాజా బుల వెంకయ్యమ్మ సత్రం దేవాదాయశాఖ పరిధిలో ఉంది. అప్పట్లో మహారాణి 452.21 ఎకరాల భూములు రాసిచ్చి ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, పేద విద్యార్థులకు భోజనాలు పెట్టడం, రోగులకు వైద్యం అందించడం ఈ ట్రస్టు లక్ష్యం. అనంతరం ఇది దేవాదాయ శాఖ పరిధిలోకి వచ్చింది. అప్పట్లో తుని నుంచి పెద్దాపురం వరకు పెద్దాపురంలోనే మహారాణి కళాశాల ఒకటి మాత్రమే ఉండేది. దీంతో వందల సంఖ్యలో విద్యార్థులు వచ్చేవారు. అనంతరం ఎక్కడికక్కడ కళాశాలలు వచ్చాయి. దీంతో విద్యార్థుల సంఖ్య తగ్గింది. అయితే దాత ఆశయాలకు అనుగుణంగా దేవాదాయశాఖ ఈ సత్రాన్ని నిర్వహిస్తోంది. ఆలయ కార్య నిర్వహణ అధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో సత్రాన్ని మరింత అభివృద్ధి చేశారు. ప్రస్తుతం 250 మంది వరకు విద్యార్థులు, ఆకలితో ఉన్నవారు ప్రతిరోజు రెండు పూటలా ఇక్కడ భోజనం చేస్తున్నారు. అదేవిధంగా హెూమియో వైద్యశాల కూడా నిర్వహిస్తున్నారు. హెూమియో వైద్యశాలకు వందల సంఖ్యలో రోగులు వస్తున్నారు. ఎవరైనా ఆకలితో వస్తే ఎలాంటి సమయం చూడకుండా అప్పటికప్పుడు వండి పెట్టడం జరుగుతుంది అన్నారు.

సాధారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు రెగ్యులర్‌గా భోజనం పెట్టడం జరుగుతుంది అన్నారు. ఆకలితో వచ్చిన వారిని కాళీ కడుపుతో పంపకుండా అప్పటికప్పుడు భోజనం వండి పెట్టే ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. గతంలో ఈ భూములు కొంతమంది ఆక్రమించి బహిరంగ వేలం జరగకుండా అడ్డుకున్నారు. ఈవో జగన్మోహన శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహారాణి సత్రాన్ని మహారాజు తరహాలో తీర్చిదిద్దారు .ఆయన ఈ సత్రం అభివృద్ధికి విశేషంగా కృషి చేసారని స్థానికులు కొనియాడుతున్నారు. అయితే 452.21 ఎకరాల భూములు ఉన్నప్పటికీ ఇందులో మెరక భూములు 283.49 ఎకరాలు. వాటికి నీటి వసతి లేకపోవడంతో పెద్దగా ఆదాయం రాదు.

మిగిలినవి మాత్రమే పంట భూములు. గతంలో 35 లక్షల ఆదాయం ఉన్న ఈ సత్రం ఆదాయాన్ని ఈవో బాధ్యతలు చేపట్టిన తర్వాత రెగ్యులర్ గా బహిరంగ వేలం నిర్వహించి రూ.42 లక్షలకు పెంచారు. దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల సహకారాలు తీసుకుని స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి ఇక్కడ వృద్ధాశ్రమం పెట్టేందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. భోజనాలు పెడుతున్నాం. వైద్యం చేయిస్తున్నాం .అయితే కొంతమంది అనాథ వృద్ధులు ఉండిపోతున్నారు. అలాంటి వారి కోసం దాత ఆశయాలకు అనుగుణంగా ఈ సత్రంలో వసతి సౌకర్యం ఉంది గనుక దాతలు కూడా సహకరించే అవకాశం ఉండడంతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. తమ శాఖ ఉన్నతాధికారులు అంగీకరించిన తరువాత ఇది ఏర్పడే అవకాశం ఉంది అన్నారు. ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా, ఎవరైనా అన్నార్తులు భోజనం కోసం అలమటిస్తే పెద్దాపురం మహారాణి సత్రంకి రావచ్చు అని ఆయన సూచించారు. అదేవిధంగా పేద విద్యార్థులు రెండు పూటలా భోజనం చేయవచ్చు అన్నారు. మహారాణి సత్రం గతంలో పాడుబడి ఉండేది. మహారాణి ఆస్తి కావడంతో మహారాజు తరహాలో దీన్ని ఈవో తీర్చిదిద్దారని సిబ్బంది చెబుతున్నారు. మొత్తంమీద అన్నార్తుల ఆకలి తీరుస్తూ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తూ విద్య, వైద్యం, అన్నదానంతో ఈ సత్రం రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందింది. డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు, గతంలో పనిచేసిన జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఈ సత్రంను చూసి ఈఓను అభినందించారు.

# దేశవ్యాప్తంగా 'హెల్తీ ఇండియా' వినూత్న కార్యక్రమం

**– ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం – అవార్డ్‌లతో యోగా ప్రముఖులకు సత్కారం**







**కాకినాడ, మేజర్ న్యూస్ :** వర్ణధర్మ హెల్త్ ఆర్గనైజేషన్ మరియు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పిరిట్యువల్ హేపీనెస్ అండ్ హెల్త్ (ఇష్) సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రామారావుపేటలో ఉన్న శ్రీరస్తు ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. సమావేశానికి లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పతంజలి అవార్డ్‌లను వేమూరి రాజగోపాల్, డా॥ బాలాంతరపు శేషుకుమారి, సంఘమిత్ర అవార్డ్‌లను కస్తూరి పట్టాభిరామారావు, లయన్ ఎం.వి.ఆర్.మోహన్ కుమార్‌లకు, యోగారత్న అవార్డ్‌లను ఎనిమిది మందికి, యోగా పెరల్ అవార్డ్‌లను పదమూడు మందికి అందజేసి సత్కరించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర ప్రభుత్వ ఇండియన్ ఇన్ఫర్మేటిక్ సర్వీసెస్ అధికారి కందాళ శ్రీరామచంద్రమూర్తి, గౌరవ అతిథిగా శ్రీవరేణ్య ధర్మప్రమోధన ప్రతిష్టానం వ్యవస్థాపకులు విద్వరణ్య సాధుప్రసాద్ స్వామీజీ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విశ్రాంత అధికారి డా॥ ఎం.బి.ఆర్.శర్మలు పాల్గొని ప్రసంగిస్తూ యోగా విద్య ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ఎటువంటి దుష్ప్రభావాలు సంభవించవని అన్నారు. యోగా మెడిటేషన్ మరియు రేకి వంటి ప్రక్రియల ద్వారా మానవులు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలరని చెప్పారు. ఈ ప్రక్రియలను నిత్యజీవితంలో ఆచరిస్తున్న వారికి ఎటువంటి అనారోగ్యం కలగదని అన్నారు.వర్ణధర్మ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డా॥ ఎన్.మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా యోగా వంటి వినూత్న ఆరోగ్య ప్రక్రియను ప్రధాని మోదీ పరిచయం చేసి ఆచరణలోకి తీసుకురాగా నేడు విదేశాలలో మంచి స్పందన వచ్చిందన్నారు.

అయితే దేశంలో అనుకున్నంతగా ప్రగతి సాధించకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేస్తూ తమ రెండు సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా హెల్తీ ఇండియా అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయదలిచామని, సమాజాన్ని బాగు చేసుకోవల్సిన ప్రధమ కర్తవ్యం అందరిపైనా ఉందన్నారు. యోగా మరియు ధ్యానం, రేకి వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని, ప్రజలలో వీటి పట్ల అవగాహన పెంపొందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. ఇష్ వ్యవస్థాపకురాలు డా॥ హైమా ప్రసాద్ మాట్లాడుతూ గత దశాబ్ద కాలంలో తమ సంస్థ ద్వారా వేలాది మంది యోగా ప్రక్రియ వల్ల ఎంతో ప్రయోజనం పొందారని వివరించారు. ఎనిమిది దేశాలలో ఆన్‌లైన్ ద్వారా కూడా బోధనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. సూర్యనారాయణ మూర్తి, సతీష్‌బాబు, విశ్రాంత ఎసిటిఓ సూర్యనారాయణ శర్మ, గాయత్రి సాధు, శ్రీవల్లి సాధు, రవి (మధ్యప్రదేశ్) ప్రభృతులు ప్రసంగించారు. ఈ సందర్భంగా సావనీర్‌ను ఆవిష్కరించగా విద్వరణ్య సాధు స్వామీజిని ఘనంగా సత్కరించారు.

# డయేరియాపై అవగాహన

**– పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు**




**గోపాలపురం, మేజర్ న్యూస్ :** గోపాలపురం మండలం చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "డయేరియా మరియు కలుషిత నీటి నివారణ" పై అవగాహన కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌ. శ్రీపాద లక్ష్మీ నరసింహ శాస్త్రి గారి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, మరుగుదొడ్లు వాడేటప్పుడు, భోజనానికి ముందు భోజనం తర్వాత "హ్యాండ్ వాష్" తప్పనిసరిగా చేసుకోవాలని, తాజా ఆహారాలను భుజించాలని, చెడిపోయిన ఆహారాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించ రాదని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగాలని తెలియజేశారు. సైన్సు ఉపాధ్యాయులు రాఘవ కుమారి, తేజస్విని, డయేరియా వ్యాధి లక్షణాలు, నివారణోపాయాలు గురించి వివరించారు. అనంతరం 400 మంది విద్యార్థులతో డయేరియా నివారణపై నినాదాలు చేస్తూ "భారీ ర్యాలీ" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వంట ఏజెన్సీ నిర్వాహకులు, సిఆర్పి కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను చివరి లబ్ధిదారుని వరకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

**– జూలై 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ సజావుగా నిర్వహిస్తాం**
**– జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా త్రాగునీరు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తాం**
**– కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను చివరి లబ్ధిదారుని వరకు అందించాలన్నదే ప్రభుత్వ పధాన లక్ష్యమని ఆ దిశగా జిల్లాలో ప్రభుత్వ అమలు చేస్తున్న కార్యక్ర మాలను వేగవంతంగా ప్రజలకు చేరవేయటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు.శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్‌భరత్‌తో కలిసి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను చిట్టచివరి లబ్ధిదారుని వరకు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆ మేరకు జిల్లాలో అన్ని శాఖల అధికారులు వారి వారి కార్యకలాపాలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అందరితో సమన్వయం చేసుకుంటూ, క్షేత్ర స్థాయిలో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈరోజు జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ నుండి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించామన్నారు.

జులై 1వ తేదీన ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు కార్యాచరణతో పటిష్టమైన చర్యలు చేపట్టమన్నారు. ఎక్కువ మొత్తంలో పెన్షన్ లబ్ధిదారులకు పంపిణి చెయ్యాల్సి ఉంటుందని, అందిస్తున్నందున సదరు మొత్తాన్ని రెండు మూడు క్లస్టర్లు ద్వారా మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. జులై ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుండి సచివాలయ , ప్రభుత్వ ఉద్యోగులతో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించ నున్నట్లు తెలిపారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా త్రాగునీరు శానిటేషన్ పై ప్రత్యేక దృష్టి సారిస్తామ న్నారు. ఇప్పటికే జిల్లాలో డయేరియా కేసులు నమోదు కాకుండా అధికారుల కార్యచరణ అమలు చేస్తున్నట్లు వివరించారు.

# శ్రీ సత్య దేవుని హుండీల ఆదాయం రూ.1,65,05,994లు



అన్నవరం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానంలో హుండీలు లెక్కింపు నిర్వహించగా శ్రీ సత్య దేవుని హుండీల ఆదాయం రూ.1,65,05,994లు, యూఎస్ఏ డాలర్లు 286, కువైట్ డిన్నర్ 3, భూటాన్ గుల్ట్రమ్ 10, సౌదీ అరేబియన్ రియాల్స్ 1, డిఏఈ -దిర్హామ్స్ 10, సింగపూర్ డాలర్స్ 10, సౌత్ ఆఫ్రికా రాండ్ 450, మలేషియా దేశం 528, బంగారం 51 గ్రాములు, వెండి 633 గ్రాములు లభ్యమయ్యాయని దేవస్థానం అధికారులు తెలియజేశారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం ఈవో కె.రామచంద్ర మోహన్ మరియు దేవస్థానం అధికారులు సిబ్బంది, వ్రత పురోహితులు, అర్చకులు, నాయి బ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

# 1న శ్రీ శృంగార వల్లభ స్వామి హుండీల లెక్కింపు



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామి దేవస్థానం నందు శ్రీ స్వామి వారి హుండీల లెక్కింపు 1వ తేది సోమవారం ఉదయం 9 గంటలకు దేవదాయ, ధర్మదాయ శాఖాధికారిరులు, పోలీస్ అధికారుల సమక్షంలో నిర్వహించబడునని, దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

# షెడ్యుల్డ్ ప్రాంతా ఉద్యోగ నియామకాల చట్టం రూపకల్పన తరువాతే

## మెగా డిఎస్‌సి -2024 నోటిఫికేషన్ ఇవ్వాలి

**ఎటపాక, మేజర్ న్యూస్ :** ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ ఎటపాక మండలం స్థానిక కార్యాలయంలో అత్యవసర సమావేశం శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పూసం శ్రీను మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలలో ఉపాధ్యాయ నియామకాలలో స్థానిక ఎస్టీ అభ్యర్థులతో భర్తీ చేయుటకు “షెడ్యుల్డ్ ప్రాంతాల ఉద్యోగ నియామకాల చట్టం” రూపకల్పన చేసిన తర్వాతే మెగా డీఎస్సీ-2024 నోటిఫికేషన్ ద్వారా ఏజెన్సీ ప్రాంతాలలో భర్తీ చేయనున్న ఉపాధ్యాయ పోస్టులను స్థానిక ఎస్టీ అభ్యర్థులతోనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జీవో నంబర్ 3 ద్వారా ఏజెన్సీలో స్థానిక షెడ్యుల్డ్ తెగల అభ్యర్థులతో శత శాతం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టారని అన్నారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(1)పేరా 5(1) చెప్పిన విధంగా చట్టాలలో మార్పులు చేయలేదనే సాంకేతిక కారణంతో సుప్రీం కోర్ట్ ఆ జీవోను కొట్టివేసిందని అన్నారు. భారత రాజ్యాంగంలో పార్ట్ 10 ది షెడ్యూల్డ్ అండ్ ట్రైబల్ ఏరియాస్ ఆర్టికల్ 244(1), 5వ షెడ్యూల్డ్ ప్రాంతాలు, షెడ్యూల్డ్ తెగల పరిపాలన మరియు నియంత్రణకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు ఉన్నాయని, ఎస్టీ శాసన, పార్లమెంటు సభ్యులు చొరవ తీసుకుని ఆదివాసులకు మేలు జరిగేవిధంగా అవగాహనతో కృషి చేయాలనీ కోరారు. షెడ్యూల్డ్ ఏరియా ట్రైబల్స్ సంక్షేమం మరియు అభివృద్ధి కొరకు టీఏసి ద్వారా అవసరమైన తీర్మానాలు చేసుకునే వెసులుబాటు ఆదివాసులకు రాజ్యాంగం కల్పించిందని,ఆదిమజాతుల వారికి మేలు చేయడానికి పార్లమెంట్ చట్టాలను,రాష్ట్ర శాసన సభ చట్టాలను తగిన మార్పులు చేర్పులతో గవర్నర్ నోటిఫికేషన్ ద్వారా వర్తింపజేసే అవకాశం ఉందని ఈ సందర్భంగా వివరించారు. 5 వ షెడ్యూల్డ్ లోని పేరా 5(1) నియమాలననుసరించి రాష్ట్ర గవర్నర్ జారి చేసిన జివో నెంబర్ 3 సుప్రీంకోర్టు కొట్టివేసిందని, అయితే పేరా 5(2) ప్రకారం గవర్నర్ నోటిఫికేషన్ పై రాష్ట్రపతి ఆమోదంతో రెగ్యులేషన్(చట్టం) చేసుకునే అవకాశం ఉందని అన్నారు. 5వ షెడ్యుల్ ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్ట్‌లు భర్తీ గురించి జాతీయ విధానం రూపొందిం చబడిందని,



షెడ్యుల్ ఏరియలో ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి గవర్నర్ నిర్ణయం తీసుకొనుటకు టీఏసి తీర్మానం కోరుతూ లేఖ పంపిన ఈ విషయం నేటివకు టీఏసి వద్ద పెండింగ్‌లో ఉందన్నారు. ప్రభుత్వం త్వరితగతిన టీఏసిని ఏర్పాటు చేయించి, తీర్మానాన్ని గవర్నర్‌కి పంపించి ఏజెన్సీ ప్రాంతానికి అవసరమైన చట్టాలలో మార్పులు తీసుకురావాలని, ఉపాధ్యాయ నియామకాలలో స్థానిక ఎస్టీ అభ్యర్థులతో భర్తీకి “షెడ్యుల్డ్ ప్రాంతాల ఉద్యోగ నియామకాల చట్టం” రూపొందించిన తర్వాతే ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డిఎస్సీ ప్రకటించి ఆదివాసి నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

అలాగే ఎన్నికల హామిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏజెన్సీ ఏరియా పోస్టులను స్థానిక ఎస్టి అభ్యర్డులతో భర్తీ చేసే విధంగా జీఓ నెంబర్ 3ను పునరుద్ధరించి ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేస్తామని అరకు బహిరంగ సభలో హామీ ఇచ్చి ఉన్నారు, ఏజెన్సీ పోస్టులను మెగా డీఎస్సీలో కలపకుండా, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రత్యేక డీఎస్సీ ద్వారా మాత్రమే ఎస్టి అభ్యర్థులతో భర్తీ చేసే విధంగా తగు చర్యలు తీసుకొవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాక రాజు, కాక శివశంకర్, కోశాధికారి పండ కిరణ్, జిల్లా నాయకులు మానే ప్రవీణ్, కోర్స శ్రీనివాస్, పూరి కిరణ్ కుమార్, పొడియం రామకృష్ణ, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లప్రోలు నగర పంచాయతీలో బిల్లుల గోల్‌మాల్ పై విచారణ చేపట్టాలి

### - జనసేన నాయకుడు గంగబాబు డిమాండ్



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** గొల్లప్రోలు నగర పంచాయతీలో చేసిన ఖర్చులు కన్నా బిల్లులు అధికంగా చూపించి ప్రభుత్వ ధనాన్ని స్వాహా చేస్తుండడంపై ఉన్నతాది ,కారులు విచారణ నిర్వహించాలని జనసేన నాయకుడు బలిరెడ్డి గంగబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల సమయంలో నాయకుల విగ్రహాల ముసుగులకు, ప్రభుత్వ కార్యాలయాలు, సచివాలయాలలో పెయింట్ వేసినందుకు లక్ష రూపాయలు ఖర్చు చేసినట్లుగా అజెండా రూపొందించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రూ.25 వేలకు మించని ఖర్చుకు సైతం లక్ష రూపాయలు అంచనాగా చూపించి ప్రభుత్వ సొమ్మును దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కార్యాలయంలో 6 కంప్యూటర్లకు బంధించిన పాత బిల్లులను కొత్తగా అజెండాలో పెట్టి రెండో పర్యాయం సొమ్ము కాజేసేందుకు ప్రయత్నిస్తుండడంపై గంగబాబు విస్మయం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణకు వినియోగించే ట్రాక్టర్లను బహిరంగ వేలం ద్వారా ఏర్పాటు చేయవలసి ఉండగా గుట్టుచప్పుడు కాకుండా చైర్ పర్సన్‌కు సంబంధించిన వ్యక్తులకే కాంట్రాక్టర్ అప్పగించి అనధికారికంగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. జనరేటర్ అద్దెలు, మోటర్ రిపేర్లు పేరుతోవేలాది రూపాయలు ఖర్చు చేసినట్లు చూపిస్తున్నారని వీటికి అయ్యేఖర్చులతో రెండు, మూడు పర్యాయాలు నగర పంచాయతీకి కొత్తవాటిని కొనుగోలు చేయవచ్చునన్నారు. చిన్న చిన్న ఖర్చులకు లక్షల రూపాయలు అయినట్లు అజెండాలో పొందుపరిచి బినామీ బిల్లులు సృష్టించడం ద్వారా ప్రజా ప్రతినిధి భర్త, ఒక అధికారి అందినకాడికి అడ్డగోలుగా దోచేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై గంగబాబు మండిపడ్డారు. నగర పంచాయతీకి సంబంధించిన అన్ని బిల్లుల పైన జిల్లా ఉన్నతాధికారులువిచారణనిర్వహించి అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గంగబాబు డిమాండ్ చేశారు. కార్యక్రమంలోటిడిపి, జనసేన, బిజెపి నాయకులు బసా రాజుబాబు, కర్రి అన్నారం,బసా చిట్టిబాబు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్‌ని కలిసిన మోడరన్ అధినేత జి.వి.రావు



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ని మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జి.వి.రావు శుక్రవారం మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్‌తో మోడరన్ విద్యాసంస్థలకు ఉన్న అనుబంధాన్ని మంత్రి లోకేష్‌తో జి.వి. రావు ముచ్చటించారు. అనంతరం మోడరన్ ఫౌండేషన్ తరపున మంత్రి లోకేష్‌కి మోడరన్ అధినేత జి.వి.రావు అకాడమిక్, డైరెక్టర్ ఎ.రమాదేవి ప్రజాహిత పురస్కారం అందజేసారు. ఈ సందర్భంగా జి.వి.రావుతో లోకేష్ మాట్లాడుతూ గత 46 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంత విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దుతున్న మోడరన్ విద్యాసంస్థల ప్రస్థానం అభినందనీయం అన్నారని మోడ్రన్ విద్యా సంస్థలు అధినేత జి.వి. రావు తెలిపారు.

# తూర్పు గోదావరి జిల్లాలో పనిచేసిన కాలం ఒక ప్రత్యేక స్థానం కలిగి ఉంది

### - ఇక్కడి ప్రజలు, అధికారుల సిబ్బంది సహకారం మరుపురాని ఘట్టం
### - రిలీవైన కలెక్టరు మాధవీలత




**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో పనిచేసిన రెండు ఏళ్ల, రెండూ నెలల కాలం నా సర్వీస్ లో మరుపురాని ఘట్టంగా డా ఏ. మాధవీలత పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ గా రెండు సంవత్సరాలు పైగా పనిచేసిన డా కె మాధవీలత కు గురువారం సాయంత్రం స్థానిక పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పి. జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జిల్లా రెవిన్యూ అధికారి జి నరసింహులు, ఆర్డీవో ఏ చైత్ర వర్షిణి, పలువురు జిల్లా అధికారులు, డివిజన్, మండల స్థాయి అధికారులు, పోలీసు అధికారులు, వివిధ శాఖల అధికారులు, కలక్టరేట్, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా కె . మాధవీలత మాట్లాడుతూ, జిల్లాలో కలెక్టరు గా పనిచేసిన కాలంలో టీం తూర్పు గోదావరి జిల్లా గా జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపే క్రమములో సంపూర్ణ సహకారం అందించిన అధికారుల నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తి తో తూర్పు గోదావరి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందలని అభిలాష వ్యక్తం చేశారు. కొత్త జిల్లా ఏర్పాటు సమయం నుంచి తదుపరి ఎన్నికల ప్రక్రియలో, ప్రకృతి విపత్తుల నివారణ సందర్భంలో సమన్వయం చేసుకుంటూ జిల్లాను అగ్రగామిగా నిలవడం లో అందరి భాగస్వామ్యం మరపురాని ఘట్టాలుగా మధురస్మృతులు కలెక్టరు మాధవీలత గుర్తు చేసుకున్నారు. బంగారు కొండ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం లో అధికారులు, ఉద్యోగులు భాగస్వామ్యం మరపురాని సందర్భం గా పేర్కొన్నారు. కలెక్టర్ మాధవీ లత ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు విజవయవంతం చెయ్యడంలో వారు చూపిన దిశా నిర్దేశనం భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తం ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సన్నాహాలు ఏర్పాట్ల సమయంలో ముందస్తు కార్యాచరణ, ప్రణాళిక సిద్ధం చెయ్యడం ద్వారా తనదైన ముద్ర వెయ్యడం జరిగిందన్నారు.రెవిన్యూ, పోలీసు అధికారులు మధ్య సమన్వయం చేసుకుంటూ జిల్లాను అగ్రగామిగా నిలవడం లో కలెక్టరు మాధవీలత చొరవ అభినందనీయం అని ఎస్పీ పి జగదీష్ తెలిపారు. ఇన్చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎన్ తేజ్ భరత్ మాట్లాడుతూ, కలెక్టరు మాధవీలత నాయకత్వంలో టీం తూర్పు గోదావరి జిల్లాగా అన్ని రంగాల్లో, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల్లో అగ్రస్థానంలో నిలవడంలో ప్రతి అడుగులో దిశా నిర్దేశనం చెయ్యడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పి. జగదీష్, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజభరత్, మున్సిపల్ కమీషనర్ కె. దినేష్ కుమార్, డిఆర్ఓ జి.నరసింహులు, ఆర్‌డిఓ ఏ. చైత్ర వర్షిణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్. మాధవరావు, ఎస్ఈఆర్‌డబ్ల్యుఎస్ డి.బాల శంకరరావు, డిఎల్‌డివో పి.వీణా దేవి, వి.శాంతమణి పలువురు జిల్లా శాఖా అధికారులు ఎస్ సుభాషిణి, వాసుదేవరావు, బి బాలస్వామి, సీహెచ్ శ్రీనివాస్, ఐకాశయ్య, రెవిన్యూ ఉద్యోగులు బాపిరాజు, క్రాంతి ప్రసాద్, తాహసిల్దార్ నాగభూషణం, తహసీల్దార్లు, ఎంపిడిఓ, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సుభాష్‌ని కలిసిన గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ అధ్యక్షులు



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో గల్ఫ్ శెట్టిబలిజ యువశక్తి సేవాసంస్థ కులమతాలకు అతీతంగా సేవ చేయడంలో ముందుంటుంది. వృత్తి రీత్యా విదేశాలలో ఉంటున్నా కూడా సొంత ఊరుపై ఉన్న అభిమానంతో ఎవరికీ ఏవిధమైన ఆపద ఉన్నా మేము ఉన్నాము అనే భరోసా కల్పిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు ఈ సేవాసంస్థ అధ్యక్ష్యులు కట్ట భాస్కర్ రామచంద్రపురం ఎమ్మెల్యే , రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీ వాసంశెట్టి సుభాష్ గారిని కట్టా భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. వృత్తిరీత్యా విదేశాల్లో ఉండటం వలన స్వదేశం వచ్చినవెంటనే మంత్రి సుభాష్ ని కలవడం ఆనందంగా ఉందని అన్నారు. వారితో పాటు సంస్థ సభ్యులు ప్రముఖ ఎలక్ట్రీకల్ కాంట్రాక్టర్ పెచ్చెట్టి ఏలేశ్వరరావు, శ్రీ లక్ష్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ కంకటాల శ్రీనివాస్, కడలి రాంబాబు, బైరిశెట్టి వెంకటరమణ, కడలి కిషోర్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ రాము లు వున్నారు.

# శ్రీ సూర్య విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే నాయకర్

**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** ఇంటర్మీడియట్ పబ్లిక్,బెటర్మెంట్ పరీక్షలలో ప్రతిభకనబరిచినశ్రీసూర్యజూనియర్‌కళాశాల విద్యార్థులను శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్ సబ్ కలెక్టర్ అచ్యుత్ అంబరీష్ కళాశాల ప్రాంగణానికి విచ్చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమానికి వీరు ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో అడబాల రోషిణి వెంకటలక్ష్మి, కందాల స్వప్న, పోలిశెట్టి లక్ష్మీ సాయి శ్రీ 465/470మార్కులుసాధించి నరసాపురం టౌన్ ఫస్ట్ గా నిలిచారు. పోతా బత్తుల మానస తులసి, రావి వినయ లక్ష్మి 464/470 మార్కులు సాధించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అచ్యుత్ అంబరీష్‌మాట్లాడుతూ “నేటి విద్యా వ్యవస్థలోపోటీఅనేది అనివార్యంగా మారిందని, విద్యార్థి నూతన విషయాల పట్ల అధ్యయనం చేస్తేనే ఉన్నత లక్ష్యాలు చేరుకోగలడని, శ్రీ సూర్య కళాశాల ఈ తరానికి అవసరమైన విద్యను అందించడంలో ముందుంటుంది కాబట్టే విద్యార్థులు ఇంత చక్కటి ఫలితాలు సాధించారనిఅన్నారు. శ్రీ సూర్య విద్యా సంస్థలు, ఉన్నత లక్ష్యాలతోపనిచేస్తూవిద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించేందుకు కృషి చేస్తున్నదని, విద్యార్థుల గెలిపే తమ గెలుపుగా భావించే విద్యా సంస్థ శ్రీ సూర్య “అనిఎమ్మెల్యే బొమ్మిడినాయకర్ అభిప్రాయపడ్డారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో 400కు పైగా మార్కులు సాధించిన 90మంది విద్యార్థులను ఈకార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఘంటసాల బ్రహ్మాజీ, అకడమిక్ అడ్వైజర్ బోయి రామచంద్రారెడ్డి,డాక్టర్ ఫాజల్ డాక్టర్ కె.జానకిరామ్ డాక్టర్ ఏ ఆర్ ఎస్ కుమార్, కడలి త్రిమూర్తులు,టి. కృష్ణ గుప్తా,పి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి


### - అధికారులతో సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈవో



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం నియోజవర్గంలో డయేరియా వ్యాధిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని జడ్పీ సీఈఓ ఏ శ్రీరామచంద్రమూర్తి అన్నారు. పిఠాపురం మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన నియోజవర్గ స్థాయి పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, హౌసింగ్, వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గంలో ఈ నెల ఒకటో తేదీన పర్యటన ఉంది కాబట్టి అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లాలో ప్రబలుతున్న అతిసార వ్యాధులపై నియోజకవర్గంలో మండలాల్లో ఆ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, శానిటేషన్ త్రాగునీరుపై క్లోరినేషన్ చేస్తూ ఉండాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో బావుల్లోంచి ఎవరైనా త్రాగునీరు ఉపయోగిస్తున్నారో, లేదో పరిశీలించాలని అన్నారు. అలాగే మండలాల్లో శానిటేషన్ పై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల కాలంలో డిఎంహెచ్వో పర్యటనలో భాగంగా ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న త్రాగునీరు మురికిగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో త్రాగునీరు పచ్చగా ఉన్నట్లయితే తగిన క్లోరేషన్ చేసి మెరుగైన నీరు ప్రజలకు అందించాలని సూచించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ ఇప్పటివరకు ఉన్న ప్రభుత్వ పథకాలపై అలాగే అభివృద్ధి పనులు పనితీరు ఏ స్థాయిలో నిలిచాయి, తదితర అంశాలతో కూడిన జాబితా రూపొందించాలని అధికారులను కోరారు. పవన్ కళ్యాణ్ పర్యటన అనంతరం నియోజవర్గ స్థాయి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం జరుగుతుందని అత్యవసర పనులు ఏమైనా ఉంటే, జాబితా సిద్ధం చేయాలని ఇప్పటి వరకు మనకు వచ్చిన గ్రాంట్లు ఏ విధంగా వినియోగించారు. ఏ స్థాయిలో నిలిచిపోయాయి. మనకు ఇంకా ఏం గ్రాంట్లు కావాలి, అనే విధంగా ప్రణాళిక సిద్ధం చేసి ఎంపీడీవోలకు జాబితా అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో జిఎస్ రాంగోపాల్ ,పంచాయతీరాజ్ డిపిఓ సౌజన్య, నియోజవర్గ స్థాయి మూడు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ శాఖ డీఈ, ఏఈ లు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు, మెప్మా సిబ్బంది, హౌసింగ్, ఐకెపి రెవెన్యూ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్తులకు పుస్తకాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

### - పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్థిక సహాయంతో పంపిణీ



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** అన్ని దానములలో కన్నా విద్యా దానం గొప్పదని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఆయన పి. గన్నవరం మండలంలోని పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద పాఠశాల ప్రధానోపాధ్యాయులు కత్తుల ఆనందరావు సౌజన్యంతో సమకూర్చిన పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల చేత ఆయన అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కిందటి ఏడాది జనసేన పార్టీ అధినేత, రాష్ట్రం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని ఇదే పాఠశాలకు రావడం జరిగిందని అప్పుడు విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఎమ్మెల్యేగా తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసే కార్యక్రమానికి రావడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు కావలసిన సదుపాయాలు కల్పించడానికి తాను అధికారులకు పూర్తి సహకారాన్ని అందిస్తానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు కే. హెలినా, వీర బ్రహ్మానందం, స్థానిక సర్పంచ్ వడలి కొండయ్య, ఎంపీటీసీలు పులపర్తి రాజారావు, మండల ఎంపీటీసీల సమక్ష అధ్యక్షుడు ఆదిమూలం సూర్యనారాయణ, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మండల అధ్యక్షుడు సాదనాల జెడి, స్థానిక నాయకులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, తెలగారెడ్డి కృష్ణ, ముంగండ శ్రీరామ్మూర్తి, తాటికాయల శ్రీను, యడ్ల ఏసు భాస్కర రావు, అరిగేల సూరిబాబు, మహిపాల తాతాజీ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ దొరబాబు, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో క్షేత్రస్థాయిలో పోలవరం పనులు పరిశీలన

**ఏలూరు,మేజర్‌న్యూస్:** పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులు, ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తానని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి చెప్పారు. స్థానిక కలెక్టర్ లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఎం.సూర్యతేజ,ఇరిగేషన్, గృహనిర్మాణం, తదితర శాఖల అధికారులు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వివరాలు, నిర్వాసితులకు అమలుచేస్తున్న ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్ వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు తెలియజేసారు. పోలవరం ప్రాజెక్ట్ లో నీటి నిల్వ సామర్థ్యం,స్పిల్ వే,స్పిల్ ఛానల్, ఎగువ కాఫర్ డాం,దిగువ కాఫర్ డాం,డయాఫ్రమ్ వాల్ నిర్మాణ పనులు, డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న ప్రాంతాలకు, తదితర వివరాలను ఇరిగేషన్ సూపెరింటెండింగ్ఇంజనీర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. పోలవరం ప్రాజెక్ట్ కారణంగా ముంపునకు గురయ్యే గ్రామాల వివరాలు, నిర్వాసితులకు నిబంధనల ప్రకారం చెల్లించాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజ్‌లో నష్టపరిహారంగా నగదు చెల్లింపు,పునరావాస కాలనీల నిర్మాణం,భూమికిభూమి, నిర్వాసితులకు ప్యాకేజ్ చెల్లింపులలో ఫిర్యాదుల పరిష్కారం,తదితర వివరాలను ఐటిడిఏప్రాజెక్ట్అధికారిఎం.సూర్యతేజకలెక్టర్‌కు వివరించారు.

# వైద్య సేవల్లో లోపాలుంటే చర్యలు

### - ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేసి, పలు వైద్య విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఓ.పి కౌంట్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అత్యవసర చికిత్స విధానాన్ని, డాక్టర్లు ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ల సంఖ్యను, వివిధ రోగాలకు సంబంధించిన వైద్య విభాగాలను పరిశీలించారు. గర్భిణీ స్త్రీలకు సంబంధించిన వార్డును, ఆపరేషన్ థియేటర్ ను పరిశీలించారు. అత్యవసర మెడికల్ వార్డులో ఉన్న డాక్టర్లు, వైద్య పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితిలో గల గర్భిణీ స్త్రీ చికిత్స వార్డును కలెక్టర్ పరిశీలించి వారికి అందుతున్న వైద్య సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందజేస్తున్న మందులపై ఆరాతీశారు. ఆక్సిజన్ ప్లాంట్ ను దాని పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు విధులకు హాజరయ్యే సమయాన్ని తెలిపే డిస్ప్లే బోర్డును, ఐసియు విభాగాన్నపరిశీలించారు. ప్రతిరోజు ఆసుపత్రికి వచ్చే డెలివరీ కేసులను ఆరా తీశారు. చంటి పిల్లల విభాగాన్ని,విధుల నిర్వహించే డాక్టర్ గురించి అడిగి తెలుసుకున్నారు. కంటి పరీక్షలు విభాగాన్ని ఆమె పరిశీలించి రోజువారీ కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది తమ విధులను సక్రమంగానిర్వర్తించాలని,తానుతరచూ ప్రభుత్వ ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేస్తానని, వైద్య సేవల్లో లోపాలు కనిపించినా, రోగులు ఫిర్యాదులు చేసినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. అంతకుముందు ఆరోగ్యమిత్ర,ఆరోగ్యశ్రీ కి కేంద్రానికి వెళ్లి రోగులనమోదు,అందించినసేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మెడికల్ కాలేజికి సంబంధించిన వివరాలను, మెడికల్ విద్యార్థుల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆకస్మిక తనిఖీలో డిసిహెచ్ఎస్ పాల్‌సతీష్,ఆసుపత్రి వివిధ విభాగాల వైద్యాధి, కారులు, తదితరులు పాల్గొన్నారు.